www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 12 అక్టోబర్ 2025
5
అన్నమయ్య





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

విచ్చలవిడిగా నిషేధిత ప్లాస్టిక్ వాడకం

అమలులో ఉన్న ప్లాస్టిక్ నిషేధం పట్ల అధికారుల చిత్తశుద్ధి కరువైంది. జిల్లాలో ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకూ విచ్చలవిడిగా అధికమైంది. ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని అధికారులు చెబుతున్నా, ఆ విధమైన చర్యలు ఎక్కడా కన్పించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. అన్నమయ్య జిల్లాలో మున్సిపల్, పట్టణ, గ్రామాల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. వీటి వాడకం, విక్రయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినప్పటికీ మార్కెట్లో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు దర్శనమిస్తున్నాయి.

ప్లాస్టిక్ కవర్లు తిని పశువులు మృతి - నిషేధం ప్రకటనలకే పరిమితం
తూతూ మంత్రంగా తనిఖీలు - పట్టని అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి



జిల్లాలో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లను విచ్చల విడిగా వినియోగిస్తున్నారు. అన్నమయ్య జిల్లాలో రాయచోటి, మదనపల్లి, రాజంపేట మున్సిపల్ కేంద్రాలతో పాటు నియోజకవర్గాలు, మండల, గ్రామీణ ప్రాంతాలలో ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వాడుతున్నారు. ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల నిషేధం చేసి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు ప్రకటనలు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా ఏ దుకాణంలో చూసినా ప్లాస్టిక్ కవర్ల వినియోగం అధికంగా ఉంది. గతంలో అధికారులు మాత్రం ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించరాదని, కేవలం బట్టలతో తయారు చేసిన సంచులను వాడాలని చెప్పారు. మున్సిపాలిటీలో గతంలో ప్లాస్టిక్ నిషేధం విధించి అప్పుడప్పుడు తనిఖీలు నిర్వహించారు. కవర్లు దొరికిన దుకాణదారులకు జరిమానాలను విధించడంతో కొంతమేరకు అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చు కోగలిగారు. కాలక్రమమైన మున్సిపాలిటీలో కూడా ప్లాస్టిక్ వినియోగం ఎక్కువైంది. ఇక జిల్లా కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ అంతంత మాత్రమే ఉంది. ప్రజలు వారు మార్కెట్లను తెచ్చు కున్న ప్లాస్టిక్ కవర్లను తిరిగి చెత్త బుట్టలో వేయకుండా ఎక్కడ బడితే అక్కడ వేయడం వల్ల మూగజీవాలు వాటిని తిని అరుగుదల లేక ప్రాణాలు కోల్పోతున్నాయి. ముఖ్యంగా మాంసం కొట్లు, కూరగాయల, పండ్ల దుకాణాలలో ప్లాస్టిక్ వల్ల వినియోగం ఎక్కువగా మారింది. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కాలువల్లో వేయడం వల్ల డ్రైనేజీలో నీరు స్తంభించి రోడ్లపై పారు తున్నాయి. రోడ్ల పక్కన ఎక్కడపడితే అక్కడ చెత్త కుప్పలు పేరుకు పోయి వాటిని సకాలంలో పారిశుధ్య సిబ్బంది తొలగించకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. మున్సిపాలిటీలో దుకాణాల్లో ప్లాస్టిక్ నిషేధం విధించక పోవడంతో పర్యావరణానికి పెనుముప్పు కల్గనుంది.



పట్టణంలో విచ్చలవిడిగా పడేసిన ప్లాస్టిక్ కవర్లను తింటున్న ఆవులు



పట్టణంలోని ఓ ప్రాంతంలో విచ్చలవిడిగా పడేసిన ప్లాస్టిక్ కవర్లు

తూతూ మంత్రంగా తనిఖీలు

అధికారులు అప్పుడప్పుడూ తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ చిన్నచితక, తోపుడు వ్యాపారులపై వారి ప్రతాపం చూపిస్తూ వారికి పెనాల్టీ నిర్ణయిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కానీ యథేచ్ఛగా కవర్లని ఎక్కడి నుంచి వస్తున్నాయి అనే విషయంపై వారు మాత్రం శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. ప్లాస్టిక్ కవర్ల అమ్మకాలు చేస్తున్న హోల్ సేల్ వ్యాపారులపై మాత్రం అధికారులు దాడులు నిర్వహించకపోవడంతో ఈ ప్లాస్టిక్ కవర్లో పట్టణాలలో విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ప్లాస్టిక్ కవర్ల అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్లాస్టిక్ సౌకర్యం ప్రమాదకరం

ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరుగుతోంది. ఇది ఒక పర్యావరణ సమస్యగా మారుతోంది. ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ఫుడ్ ప్యాకేజింగ్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వంటి వాటి వల్ల అనేక పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. మన ఆరోగ్యానికి, పర్యావరణానికి హాని కలుగుతుంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉపయోగించిన తర్వాత వ్యర్థంగా వదిలేస్తున్నాం. ఇది నేల, నదులు, సముద్రాలను కాలుష్యం చేస్తుంది. ప్లాస్టిక్ మైక్రో ప్లాస్టిక్‌గా విడిపోయి మన ఆహారంలో చేరుతోంది. ప్లాస్టిక్‌లోని బిపిఎ అనే కృత్రిమ రసాయనం శరీరంలో హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. విషవాయువులు విడుదలై శ్వాసకోశ వ్యాధులను కలిగిస్తాయి. ప్లాస్టిక్ కంటైనర్లలో వేడి పదార్థాలను పెట్టకూడదు. సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ బదులుగా జ్యూట్, కాగితం, వెదురు వంటి పర్యావరణ అనుకూల వస్తువులను వాడాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను వేరుచేసి రీసైకిల్ చేయాలి. బజారుకు వెళ్లేప్పుడు ప్రతి ఒక్కరూ కాటన్ బ్యాగులను తీసుకెళ్లాలి.



- ప్రకాష్‌రెడ్డి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయచోటి.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం

జిల్లావ్యాప్తంగా ప్లాస్టిక్ కవర్లు వాడకూడదని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రజలు ఇంటి నుండి బజారుకు వెళ్లేప్పుడు బ్యాగులు తీసుకెళ్లాలి. ఎక్కడైనా ప్లాస్టిక్ కవర్లు అమ్ము తున్నారని ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్య తీసుకుంటాం. జిల్లాలో ప్లాస్టిక్ కవర్లను అరికట్టడానికి అన్ని చర్య తీసుకుంటున్నాం.



- రాధ, డిపిఒ,రాయచోటి.

రైతుల ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యం

- కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన కార్యక్రమంతో అన్నమయ్య జిల్లాలోని ప్రతి రైతుకు ఆదాయం రెట్టింపు చేయడమే లక్ష్యమని, వ్యవసాయ ఉత్పాదకత పెంచడం ఎక్కువ భూమిని సాగులోకి తీసుకురావడం పంట రుణాలు రైతులందరికీ చేరవేయడమే లక్ష్యంగా ఈ పథకం అమలవుతుందని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శనివారం ఉదయం దేశవ్యాప్తంగా 100 జిల్లాలలో ప్రధానమంత్రి ధన ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రధానమంత్రి ప్రారంభ కార్యక్రమం అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ధనధాన్య కృషి యోజన కార్యక్రమంలో ఎంపిక కాబడిన 100 ఆకాంక్షిత వ్యవ సాయ జిల్లాలలో అన్నమయ్య జిల్లా ఎంపిక కావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఉద్యానవనం, ఇతర అనుబంధ రంగాలు జిల్లాలో అభివృద్ధి చెందుతాయని ఆకాంక్షించారు. వ్యవసాయంలో తక్కువ ఉత్పాదకత, క్లిష్టతర వ్యవసాయ పరిస్థితులు, సగటున తక్కువ వ్యవసాయ రుణాలు తీసుకునే పరిస్థితులు ఉండే కనీసం ఒక జిల్లాను ఆకాంక్షిత వ్యవసాయ జిల్లాగా తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. వ్యవసాయం ఉత్పాదకత పెంపు, వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటల మార్పు, సానుకూల వ్యవసాయ పద్ధతులను అనుకరించేలా చేయడం, పంచాయతీ, బ్లాక్ స్థాయిలో పంట కోత అనంతరం పంట నిల్వకు అవసరమైన చర్యలు, నీటి వనరుల లభ్యతను పెంచడం, స్వల్ప, దీర్ఘకాలిక రుణాల లభ్యత అనే ఐదు లక్ష్యాలతో ఈ పథకం అమలవుతుందని పేర్కొన్నారు.కేవలం వ్యవసాయ శాఖ మాత్రమే కాకుండా గ్రామీణ అభివృద్ధి, సహకార, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, పశు సంవర్ధక, పాడి, మత్స్య తదితర రంగాలకు నీతి ఆయోగ్ నాబార్డ్ తదితర శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆకాంక్షిత వ్యవసాయ జిల్లాలలో రైతుల జీవితాలను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. మొత్తం 11 శాఖలకు సంబంధించిన 36 కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు జోడించి 73 సూచికలలో కనీసం 46 సూచికల ఫలితాలను రాబట్టే విధంగా ఈ కార్యక్రమం అమలవు తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య ఉద్యాన ఉత్పాదకత కోసం ఎంతో కృషి చేశారని, తన అభ్యర్థనకు స్పందనగా జిల్లా ఈ పథకంలో భాగస్వామ్యమైందని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో కేవలం 16 శాతం మాత్రమే సాగు చేయబడుతుందని, దీనికి ప్రధాన కారణం వర్షాలు సకాలంలో పడకపోవడం వల్ల అని పేర్కొన్నారు. ఎకరాకు వచ్చే ఉత్పాదకత మన జిల్లాలో తక్కువగా ఉందని గోదావరి జిల్లాలో ఉత్పాదకత ఎక్కువగా ఉంటుందన్నారు. గోదావరి జిల్లాలలో సంవత్సరానికి మూడు పంటలు వస్తాయని అన్నమయ్య జిల్లాలో సంవత్సరానికి ఒక పంట రావడం కూడా కష్టం అవుతుందని పేర్కొన్నారు. బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకునేవారు మన జిల్లాలో తక్కువగా ఉన్నారని, బ్యాంకులు అందించే సదుపాయాన్ని ఎక్కువమంది రైతులు వినియోగించుకో లేకపోతున్నారని పేర్కొన్నారు. ఈ ముఖ్యమైన సమస్యలను పరిష్కరించే విధంగా ప్రధానమంత్రి తన ధాన్య కృషి యోజన కార్యక్రమం అమలవు తుందని పేర్కొన్నారు. జిల్లాలో మూడు వేలకు పైగా చిన్న తరహా చెరువులు ఉన్నాయని వీటిని అభివ ృద్ధి చేయడం, వర్షం వచ్చినప్పుడు ఈ ట్యాంకులన్నిటిని నింపడం ఈ పథకంలో భాగమ న్నారు. ఈ పథకం ద్వారా అన్ని మండలాలలో కోల్డ్ స్టోరేజ్ సదుపాయాలను నిర్మించడం జరుగుతుం దన్నారు. రైతులు పంటకు వాడే యూరియా ఎక్కువగా ఉండకుండా సుస్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించడం కూడా ఇందులో భాగమన్నారు. హెచ్ ఎన్ ఎస్ ఎస్ ద్వారా మరింత భూమి సాగులోకి వస్తుందని, దీనికి అదనంగా ఈ కార్యక్రమం జోడైతే జిల్లాలోని రైతులందరికీ ఆదాయం రెట్టింపు అవుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ అధికారి మజీద్ అహ్మద్, జిల్లా ఉద్యాన కొన శాఖ అధికారి సుభాషిని, పిడి ఎపిఎంఐపి లక్ష్మీ ప్రసన్న, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్, నాబార్డ్ అధికారి విజయ విహారి, ఎల్‌డిఎం ఆంజనేయులు, జిల్లా సహకార శాఖ అధికారి గురు ప్రకాష్, మత్స్యశాఖ అధికారి సుశ్మిత, జిల్లా సాగునీటి శాఖ అధికారి సాయిరాం ప్రసాద్, ప్రకృతి వ్యవసాయ రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

శుభ్రత పాటించని 7 హోటళ్లకు నోటీసులు
జిల్లా ఆహార భద్రత శాఖ అధికారి షమీంబాషా

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో నాణ్యత పాటించని రెస్టారెంట్లు, హోటళ్లపై చర్యలు తప్పవని జిల్లా ఆహార భద్రత శాఖ అధికారి షమీం బాషా పేర్కొన్నారు. కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు మున్సిపాల్టీ పరిధిలోని పలు హోటళ్ళు, రెస్టారెంట్లను శనివారం ఆహార భద్రతా విభాగం అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆహార భద్రతాధికారులతో పాటు మున్సిపల్ సిబ్బంది కలిసి పట్టణంలోని 13 హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేశారు. ఆయా హోటళ్లల్లో పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, పారిశుధ్య పరిస్థితులపై క్షుణ్ణంగా అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేసి, వంట గదిలలో పరిశుభ్రత పాటించని ఏడు హోటళ్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. వంటగది, భోజన టేబుల్స్‌తో పాటు హోటల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రతగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ కూడా పాటించాలని పేర్కొన్నారు.



హోటల్‌లో తనిఖీ చేస్తున్న ఆహార భద్రత అధికారులు

హోటల్లో తగినంత పరిశుభ్రత పాటిం చినప్పుడు ప్రజల ఆరోగ్యం బాగుంటుందన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆహార భద్రత అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరాలని రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ ఎం.కె.రవీంద్ర అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మాసాపేట సుగవాసి రాజారామ్ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జయహో యువత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్లబ్ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవ కోసం ప్రతి ఒక్కరూ చిన్నప్ప టినుండే ముందడుగు వేయాలని పేర్కొన్నారు. సమాజం పట్ల పూర్తి స్థాయి అవగాహన కల్పించ డం విధేయులై ఉండాలన్నారు. క్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ కృష్ణ దేవరాయలు మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుంటూనే మరోవైపు మానసిక, శారీరక ఉల్లాసం కోసం యోగాసనాలు వేస్తూ ఆరోగ్యమే మహాభాగ్య మునే ఆలో చనతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పట్టుదలతో చదువుతూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్టడీ మెటీరి యల్ దాతలు సుగవాసి జానకి రామ్ కుప్పంరెడ్డి శంకర్, క్లబ్ అధ్యక్షుడు వైవిఎస్ ప్రకాష్, సెక్రటరీ మహేష్ రాజు, అసిస్టెంట్ గవర్నర్లు డి.ఆర్.సురేష్, మురళీధర్ రెడ్డి, రియాజుద్దీన్ ,పప్పిశెట్టి సురేష్ లతోపాటు క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్.కె.హుస్సేన్, అష్రఫ్, మనోజ్, జోషి లతో పాటు పలువురు సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న రోటరీ గవర్నర్, సభ్యులు

దుర్మార్గం

ప్రజా'దృష్టి'

జిల్లాలోని ఇటీవలి ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించాయి. నకిలీ మద్యం, పిపిపి మోడ్‌లో మెడికల్ కళాశాలలు, మానసిక సమస్యతో డబ్బులు ఇవ్వలేదనే కోపంతో తల్లిని గొంతు కోసిన కుమారుడి ఉదంతం విస్మయాన్ని కలిగించాయనడంలో సందేహం లేదు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి టిడిపి మాజీ నేత జయచంద్రారెడ్డి నకిలీ మద్యం స్కామ్ సూత్రధారి కావడం భయాందోళన కలిగిస్తోంది. అధికారం అండ చూసుకుని నకిలీ మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తూ ప్రజారోగ్యానికి పాతర వేయడం హేయనీయం. మద్యం విక్రయాలను కట్టడి చేయడం ద్వారా ప్రజా రోగ్యాన్ని పరిరక్షించాల్సిన పాలకులు ఎన్నికల ప్రచారానికి మద్యాన్ని సైతం వాడుకోవడం స్వార్థరాజకీయాలకు పరాకాష్ఠగా చెప్పవచ్చు. బాధ్యత కలిగిన సర్కారు మద్యనిషేధాన్ని అమలు చేసి పేదరికాన్ని రూపుమాపే ప్రయత్నాలు చేయాలి. అటువంటి ప్రయత్నాలు చేయక పోగా ఉద్దేశపూర్వకంగా మద్యాన్ని కల్తీ చేయడం ద్వారా కోట్లు దోచుకునేందుకు ఒడిగట్టడం దుర్మార్గం. పైగా నకిలీ మద్యం స్కామ్‌ను ప్రత్యర్థులపైకి నెట్టడం ద్వారా రాక్షస రాజకీయాలు చేయజూడడం ఏహ్యాభావాన్ని కలిగిస్తోంది. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి సర్కారుకు ఓట్లు వేసిన మద్యంప్రియుల శారీరక, మానసిక, ఆర్థిక ఆరోగ్యాల్ని బలిపీఠంపైకి ఎక్కించడం క్షంతవ్యం కాని నేరం. బాధ్యత కలిగిన పాలకులు మద్యనిషేదాన్ని అమలు చేసి సామాన్యుల, మేధా వుల ఆదరాభిమానాలను చవిచూడటానికి పాటుపడాలి. కడప, అన్నమయ్య జిల్లాలోని పులివెందుల, మదనపల్లి మెడికల్ కళాశాలలను పిపిపి మోడ్‌లో ప్రయివేటుకు కట్టబెట్టడంపై ఆందోళన నెలకొంది. విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, మేధావుల నిరసనల వెల్లువ పెల్లుబికుతోంది. రాజకీయాలకు అతీతంగా కూటమి సర్కారు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటోంది. ప్రభుత్వం భవనాలను నిర్మించింది. మెడికల్ కళాశాలల నిర్వహణ బాధ్యతల్ని పాలకుల తాబేదారులకు కట్టబెట్టాలనుకోవడం దారుణం. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చినప్పటికీ మెడికల్ కళాశాలల ప్రారంభం దగ్గర నుంచి పిల్లిమొగ్గలు వేయడం అందరికీ తెలిసిందే. ప్రభుత్వం నిర్వాకం కారణంగా 150 మెడికల్ సీట్లను పేదవిద్యార్థులు కోల్పోయారు. ఇంతటితో సరిపెట్టకుండా పేద విద్యార్థుల వైద్యవిద్యను అభ్యసించాలనే సామాన్యుల ఆశలను మొగ్గలోనే తుంచేయాలనుకుంటోంది. ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన ఓ యువకుడు ఖర్చులకు డబ్బులు ఇవ్వలేదనే పేరుతో తండ్రిని గదిలోకి వెళ్లనిచ్చి గడియపెట్టి తల్లి గొంతు కోసిన ఉదంతం కలకలం రేపింది. భయానక నేరానికి పాల్పడి ఏమీ తెలియనట్లు, చేయనట్లు సెల్ ఆన్ చేసుకుని పాటలు వింటూ కాలక్షేపం చేయడం విస్మయాన్ని కలిగించింది. ప్రపంచ సైక్రియాటిక్ వారోత్సవాల ముంగిట మానసిక రుగ్మత కలిగిన ఘటన చోటుచేసుకోవడం దిగ్భ్రాంతిని కలిగించింది. జిల్లాలో చోటుచేసుకున్న ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ సైక్రియాటిక్ వారోత్సవాల ర్యాలీ, ప్రదర్శనల ద్వారా సైక్రియాటిక్ విభాగం అవగాహన కార్యకలాపాల్ని పెంచాల్సిన అవసరం ఉరుముతోంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

గవర్నర్ దృష్టికి ప్రజల ఆక్రందనలు

- వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణపై ప్రజల ఆవేదన, ఆక్రందనలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడానికే కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆయన పార్టీ నేతలతో కలిసి కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమంలో భాగంగా ఈ నెల 10 నుండి రచ్చబండ కార్యక్రమం, 28వ తేదీన నియోజకవర్గాల్లో ర్యాలీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, 23న నియోజకవర్గాల నుంచి కోటి సంతకాల సేకరణ జరిపి గవర్నర్‌కు అందించేలా కార్యాచరణను రూపొందించినట్టు చెప్పారు. నర్సీపట్నంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన అడ్డుకునేందుకు కూటమి ప్రభుత్వం అనేక ఆటంకాలు సృష్టించినట్లు ఆరోపించారు. 70 కిలోమీటర్ల వరకు లక్షలాది మంది ఘనస్వాగతం పలికి జగన్ పట్ల ఉత్తరాంధ్ర ప్రజలు విశేష ఆధరణను చూపించారని పేర్కొన్నారు. తన బినామీలకు మేలు చేసేందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో తీసుకొస్తున్నట్లు ఆరోపించారు. చంద్రబాబు ఆరోగ్యశ్రీ పథకంను నిర్వీర్యం చేసి, మెడికల్ విద్యను దూరం చేసి పేదలకు ఆరోగ్యం, విద్యను అందకుండా చేస్తున్నట్టు ఆరోపించారు. జగన్ హయాంలో కల్తీ మద్యం వల్ల ఏదేదో జరిగిపోయినట్లు ఆరోపణలు చేసి న చంద్రబాబు చివరకు వాటిని నిరూపించలేక పోయారని పేర్కొన్నారు. పేగులు తెగిపోయేటటువంటి స్పిరిట్‌తో తయారు చేసే మద్యం పరిశ్రమను రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల నెలకొల్పి పేద ప్రజలను టిడిపి నేతలు దోచుకుంటున్నారంటూ మండిపడ్డారు. మొలకలచెరువు తోపాటు పలు కల్తీ మద్యం తయారీ పరిశ్రమలలో వేలాది నకిలీ మద్యం బాటిల్ తయారుచేసి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడారన్నారు. నకిలీ మద్యం కేసుపై వెంటనే సిబిఐ విచారణ జరిపించి చంద్రబాబు, లోకేష్ బాబుల ప్రమేయంపై నిగ్గు తేల్చాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజు రెహమాన్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, వైసిపి నేతలు విజయభాస్కర్, జాఫర్ అలీఖాన్, బేపారీ మహమ్మద్ ఖాన్, కొలిమి హారూన్ బాష, రియాజుర్ రెహ్మాన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ మెంబర్లు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట

అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో'7వ అంతర్జాతీయ సదస్సు డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ అండ్ అప్లికేషన్స్ (ఐసిడిఎస్ఎంఎల్ఎ2025)పేరుతో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సదస్సు డిసెంబర్ 23, 24వ తేదీలలో నిర్వహించే సదస్సు బ్రోచర్‌ను శని వారం అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ సి.గంగిరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి, వైస్ చైర్మన్ సి.యల్లారెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.ఎం.వి.నారాయణ, డిప్యూటీ డైరెక్టర్ అడ్మిషన్స్ బి.జయరామిరెడ్డి, ప్రోగ్రామ్ చైర్ జె.చిన్న బాబు, కన్వీనర్ సి.హెచ్. నాగ రాజు, పబ్లికేషన్ చైర్స్ ఎస్.ఫహీముద్దీన్, సి.వెంకటేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ కరీ ముల్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సి.గంగిరెడ్డి మాట్లాడుతూ అన్నమాచార్య విశ్వవిద్యాలయం విద్యార్థులు, అధ్యాపకులు మరియు పరిశోధకులు ప్రపంచస్థాయి జ్ఞానం, సాంకేతిక నైపుణ్యాలు, మరియు ఆవిష్కరణాత్మక ఆలోచనలను అభివృద్ధి చేసుకోవడానికి ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. నేటి యుగం పూర్తిగా డేటా ఆధారంగా ముందుకు సాగుతోందని, డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి రంగాలు మన భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక సాంకేతిక విభాగాలని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థులు మరియు పరిశోధకులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులతో ఆలోచనల మార్పిడి జరిపి, కొత్త ఆవిష్కరణలకు దారితీయగలరని, అన్నమాచార్య విశ్వవిద్యాలయం పరిశోధన, ఆవిష్కరణ, మరియు అంతర్జాతీయ సహకారాల దిశగా ముందడుగు వేస్తూ విద్యార్థుల్లో సాంకేతిక నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించడంలో విశిష్టమైన పాత్ర పోషిస్తోందని అన్నారు. ఇలాంటి సదస్సులు భవిష్యత్ ఇంజినీర్లకు కొత్త దిశ చూపుతాయన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-రాయచోటి

మానవసేవే రెడ్ క్రాస్ ధ్యేయమని, సేవా భావంతో పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని డిఆర్వో మధుసూదన్‌రావు తెలిపారు. శనివారం మాసాపేటలోని సాయి శుభా కళ్యాణ మండపంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ వార్షిక సాధారణ సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులతో కలిసి డిఆర్‌ఒ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ చేయాలనే ప్రతి ఒక్కరు రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వారు కరుణ, నిబద్ధతతో మానవ సేవ అనే రెడ్ క్రాస్ ధ్యేయాన్ని ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. అందరి సహకారంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అన్నమయ్య జిల్లా శాఖను ఆదర్శంగా తీర్చిదిద్దుతామ న్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

సమావేశం అనంతరం అన్నమయ్య జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు 11 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తరువాత చైర్మన్, వైస్ చైర్మన్, ట్రెజరర్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర పాలకమండలి సభ్యులు రవి ప్రకాష్ ఎన్నికల పరిశీలకుడిగా హాజరై ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. ఎన్నిక అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ 11 మంది సభ్యులచే డిఆర్‌ఒ ప్రమాణ స్వీకారం చేయించిన వారిలో చైర్మన్, రిటైర్డ్ ప్రభుత్వ అధికారి డాక్టర్ పి.రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్, సామాజిక సేవకుడు షేక్ మొహమ్మద్ షరీఫ్, కోశాధికారి డాక్టర్ వేణుగోపాల్, సభ్యులుగా మదనపల్లె భారతమాత స్ఫూర్తి కేంద్రం డాక్టర్ జగదీశ్, కలికిరి జెఎన్‌టియు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అపర్ణ, రామాపురం డాక్టర్ వి.ప్రతాప్, రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మహేశ్వరరాజు, రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డైట్ ప్రిన్సిల్ డాక్టర్ మడితాటి నరసింహారెడ్డి, ఐపిఎల్ క్రికెట్ ప్లేయర్ (సిఎస్‌కె) హరీశంకర్, అంతర్జాతీయ ఫెన్సింగ్ చాంపియన్ బేబీ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి, రాష్ట్ర కార్యవర్గ కమిటీ సభ్యులుగా ఎంపికైన రాజశేఖర్‌రెడ్డికి జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి డివిజన్ రెడ్ క్రాస్ సెక్రటరీ శ్రీనివాసులు, భరతమాత స్ఫూర్తి కేంద్రం సభ్యులు గోవర్ధన్, గురవయ్య, కౌన్సిలర్ చంద్రశేఖర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, సాయి ఇంనినీరింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జయచంద్రారెడ్డి కారు డ్రైవర్ అరెస్టు

ప్రజాశక్తి-ములకలచెరువు

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో నిందితుడుగా తంబళ్లపల్లె మాజీ టిడిపి ఇన్‌ఛార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి కారు డ్రైవర్ అష్రఫ్‌ను శనివారం ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. తంబళ్లపల్లి కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండటంతో తహశీల్దార్ శ్రీనివాసులు ఎదుట హాజరుపర్చగా ఈనెల 17వ తేదీ వరకు రిమాండ్‌కు ఆదేశించారు. ములకలచెరువు ఎక్సైజ్ పోలీసులు అష్రఫ్‌ను ఎ21గా కేసు నమోదు చేసి తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రిలో డాక్టర్ అమరసింహారాజు వైద్య చికిత్సలు నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసులు ముందు హాజరు పరిచారు. ఆయన అష్రఫ్‌కు రిమాండ్‌కు ఆదేశించారు. అనంతరం అష్రఫ్‌ను ఎక్సైజ్ పోలీసులు రిమాండ్ నిమిత్తం మదనపల్లి సబ్ జైలుకు తరలించారు.

రైతుల అభివృద్ధే లక్ష్యంగా 'ధన ధాన్య యోజన'

ప్రజాశక్తి-కలికిరి

రైతుల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ధన ధాన్య యోజన కార్యక్రమం ప్రవేశపెట్టిందని సహకార బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రకుమార్ రెడ్డి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి లో ప్రధానమంత్రి ధన ధాన్య యోజన పథకం విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రదర్శించారు. ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి కెవికె కో-ఆర్డినేటర్ మంజుల హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె జిల్లా రైతుల ప్రయోజనాల కోసం సంవత్సరానికి రూ.240 కోట్లు విడుదల చేస్తారని, ఈ పథకం ఈ సంవత్సరం నుంచి ఆరేళ్ల పాటు అమల్లో ఉంటుందని తెలిపారు. కె.వి.కె కలికిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నల్లారి చంద్రకుమార్ రెడ్డి, సింగల్ విండో చైర్మన్ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయంలో తక్కువ ఉత్పాదకత గల 100 జిల్లాల్లో వ్యవసాయానికి చేయూతనందించడానికి కేంద్ర ప్రభుత్వం ధన ధాన్య యోజన పథకం అమలు చేసిందని తెలిపారు. మన రాష్ట్రం నుంచి నాలుగు జిల్లాలైన అన్నమయ్య, సత్యసాయి, అనంతపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాలను ఎంపిక చేయడం జరిగిందన్నారు. పంటల ఉత్పాదకత సాగు విస్తీర్ణం రుణ విని యోగం, సాగు నీటి సదుపాయాలను, ఎంపిక చేసుకున్న జిల్లాల్లో అభివృద్ధి చేయడానికి చేయూతనందిస్తారని తెలిపారు. డాక్టర్ ఎ.శ్రీనివాసులు, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త మామిడి, టమోటాలో యాజమాన్య పద్ధతుల్ని వివరించారు. డాక్టర్ కే.మాధురి, కెవికె విస్తరణ విభాగం శాస్త్రవేత్త కెవికె అందిస్తున్న విస్తరణ సేవలను వివరించారు డాక్టర్ వై.పీరు సాహెబ్, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త వివిధ పంటల్లో అడవి పందుల యాజమాన్యం, సేంద్రీయ వ్యవసాయం గురించి వివరించారు. కార్యక్రమంలో రైతులు, రైతు ఉత్పాదక సంఘాలు, సేంద్రీయ వ్యవసాయ రైతులు, కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది, తిరుపతి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ధన ధాన్య యోజన గురించి వివరిస్తున్న నల్లారి చంద్ర కుమార్ రెడ్డి

శ్రీశైలంకు బస్సు ఏర్పాటు చేయాలి



రమేష్‌నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని శ్రీశైలంకు వెళ్ల యాత్రికులకు రాజంపేట నుంచి శ్రీశైలంనకు ఆర్‌టిసి బస్సు ఏర్పాటు చేయాలని నందలూరు లయన్స్‌క్లబ్, వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడును కోరారు. శనివారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లయన్ మస్తేం రామ్మోహన్ మాట్లాడుతూ గతంలో రాజంపేట నుంచి శ్రీశైలం వెళ్ళు భక్తులకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం రాజంపేట డిపో నుంచి ఉండేది, ప్రస్తుతం ఆ సర్వీస్ రద్దు చేశారని తెలిపారు. రాజంపేట ప్రాంత ప్రజల కోరిక శ్రీశైలం వెళ్ళుటకు రాజంపేట నుంచి బస్సును పునరుద్ధరించాలని కోరారు. ఈ విషయంపై చైర్మన్ వెంటనే స్పందించి జిల్లా ఆర్‌టిసి ఉన్నతాధికారి రాముతో ఫోన్ ద్వారా సంప్రదించి రాజంపేట ప్రజల అవసరాల దృష్ట్యా శ్రీశైలంకు బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. ఇదే విషయాన్ని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దృష్టికి కూడా చర్చించి బస్సు ఏర్పాటుకు తన వంతు ప్రయత్నం చేయగలనని తెలిపారు. కార్యక్రమంలో లయన్ కుర్రా మణియాదవ్, వాకర్ ఉప్పుశెట్టి సుధీర్, మోడపోతుల రాము, సీనియర్ లయన్ అబ్దుల్లా, లయన్ దండే ప్రకాష్, హిమగిరి యాదవ్, గంధం గంగాధర్, గండికోట కృష్ణ కుమార్, గుండు సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి 'పెద్దిరెడ్డి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కలకడ

మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కలకడలో మండల పార్టీ అధ్యక్షులు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలుతెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు మస్తాన్‌అహ్మద్, వైసిపి కార్యకర్తలు శావత్‌అలీ, సద్దాం హుస్సేన్, అక్రమ్‌బాష, వెంకటప్రసాద్‌రెడ్డి, షకీల్‌అహ్మద్, రవికుమార్, కుమార్ రెడ్డి, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లె :**అర్బన్ రీజనల్ కో-ఆర్డినేటర్, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి జన్మదిన వేడుకలు మదనపల్లెలో పండుగ వాతావరణంలో జరిగాయి. శనివారం స్థానిక వైసిపి కార్యాలయం వద్ద వైసిపి యువజన విభాగం అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు నియోజకవర్గం సమన్వయకర్త నిస్సార్ అహ్మద్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ షమీమ్ అస్లాం, మునిసిపల్ చైర్ పర్సన్ వి.మనూజా రెడ్డి, వైస్ ఛైర్మన్ నూర్ అజాంలు హాజరయ్యారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిస్సార్ అహ్మద్ మాట్లాడుతూ పేద ప్రజల సేవే పరమావధిగా సేవలు అందించిన మా పెద్దాయన ప్రజాసేవలో చిరకాలం ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిఎస్.రెడ్డి, రఘునాథ రెడ్డి, దండాల రవిచంద్రారెడ్డి, వెలుగు చంద్ర, శీలం రమేష్, షేక్ ఇర్ఫాన్, ఆవుల మల్లికార్జున, నిమ్మనపల్లె రామ్మోహన్ రెడ్డి, చిప్పిలి మల్లికార్జున ఒడ్డి, కౌన్సిలర్లు ఈశ్వర్ నాయక్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కలికిరి : పెద్దిరెడ్డి జన్మదిన వేడుకల్లో వైసిపి నాయకులు

కలికిరి: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు కలికిరి ఎస్ఎస్ కల్యాణమండపం ఆవరణంలో వైసిపి నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ చింతల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఎస్ కల్యాణ మండపం సమీపంలో భారీ కేక్ కట్ చేసి ఒకరికొకరు కేక్ పంచుకొని ఆనందోత్సవాల మధ్యఘనంగా పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల గ్రామ కమిటీ అధ్యక్షుడు హనీఫ్, శివాజీ, మధు రెడ్డి, ఎస్‌టిడి హరి, వెంకటపతి, రేష్, శామ్యూల్, సర్పంచులు గంగయ్య, ఇస్తాయాక్ అహ్మద్, ధనుంజయ రిజవాన్, మురళీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ఎంఆర్‌పిఎస్ నిరసన



సమావేశంలో మాట్లాడుతున్న డానియేల్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

దళిత వర్గానికి చెందిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి భూషణ్ రామకృష్ణ గవాయిపై ఇటీవల జరిగిన దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలోని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద సోమవారం నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంఆర్‌పిఎస్ ఇన్‌ఛార్జి కోట డానియల్ మాదిగ తెలిపారు. మండల కేంద్రంలోని కొండా ఎస్టేట్ ఆవరణంలో శనివారం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా సమీక్షా సమావేశం సీనియర్ నాయకులు భవాని వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డేనియల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాది నుంచి దళితవర్గానికి చెందిన వారికి సమాజంలో అవమానాలు ఎదురవుతున్నట్లు తెలిపారు. రాజ్యాంగ బద్ధంగా పదవులలో క్లాస్ ఫోర్ ఉద్యోగం పొంది, దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న భూషణ్ రామకృష్ణ గవాయి కూడా ఈ అవమానాలు తప్పలేదన్నారు. అధికారం కోసం పేద వర్గాలకు పదవులు ఇవ్వడం పరిపాటిగా మారిందన్నారు. అధికారం దళితుడికి వచ్చిన తర్వాత ఉన్నత వర్గాలు ఈర్షపడడం మామూలుగా మారిందన్నారు. సమాజంలో నిత్యం దళితులు అవమానాలకు దాడులకు గురవుతూనే ఉన్నాం న్నారు. గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ దేశవ్యాప్తంగా మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరసన కార్యక్రమానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గ మండలాలు, గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని తెలిపారు.

ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి మండల కమిటీ ఎంపిక

ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి జిల్లా సమీక్ష సమావేశంలో బి.కొత్తకోట మండలం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి కమిటీల ఎంపిక జరిగింది. ఎమ్మార్పీఎస్ టౌన్ అధ్యక్షుడిగా మురళి మాదిగ, మండల అధ్యక్షులుగా పలక హరి మాదిగ, గౌరవ అధ్యక్షులుగా కొమ్ము రాముడు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దంపెట్ల వేణు మాదిగ, అధికార ప్రతినిధిగా జి.శంకర్, ఉపాధ్యక్షులుగా టీ.నర్సింహులు ప్రధాన కార్యదర్శిగా ఎం.మనోహర్ ప్రచార కార్యదర్శిగా డి.నరసింహులు, కోశాధికారిగా సూర్యనారాయణ కార్యదర్శిగా గట్టు అమరాలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా ఎమ్మెస్పి మండల అధ్యక్షుడిగా పలక రఘు మాదిగ, గౌరవఅధ్యక్షులుగా బాలు, గౌరవ సలహాదారుడిగా గంగులప్ప, ప్రెసిడెంట్‌గా గట్టు రమణ మాదిగ, అధికార ప్రతినిధి శంకర, ఉపాధ్యక్షులుగా గణపతి, ప్రధాన కార్యదర్శి మారప్ప, ప్రచార కార్యదర్శిగా గంగన్నలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు చౌడప్ప, తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి తిరుపాల్ మాదిగ, పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్, నాయకులు రామప్ప, సదుం వెంకటప్ప, బోనాసి కృష్ణప్ప, మల్లెల రవి, రమణ, గంగాద్రి, కుమార్, చరణ్ కుమార్, జానీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీలేరు పరిసరాల్లో 'ఎంత చిత్రం కథ' చిత్ర నిర్మాణం

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పరిసరాల్లో 'ఎంత చిత్రం కథ' చిత్ర నిర్మాణం చేపట్టారు. గత మూడు రోజులుగా సదుం మండలం, ఊటుపల్లి సమీపంలోని మల్లేశ్వర స్వామి ఆలయం పరిసరాల్లో చిత్ర నిర్మాణం జరుగుతోంది. ఎంఎన్ నాని అందించిన కథ ఆధారంగా ఎమ్ఎమ్ స్టూడియోస్, ఎస్‌పిడి నిర్మాణంలో కిరణ్, సూర్య, జగదీశ్ నిర్మాతలుగా, రాకేష్ దర్శకత్వం సినిమా రూపొందుతోంది. ఈ చిత్రం మొదటి షెడ్యూల్ నిర్మాణం కడప పరిసరాల్లో విజయవంతంగా పూర్తి చేసుకుంది. రెండో షెడ్యూల్లోని కొన్ని కీలక సన్నివేశాలతో పాటు మరికొంత టాకీ పార్ట్‌ను పీలేరు పరిసరాల్లో నిర్మిస్తున్నారు. కర్మ సిద్ధాంతం కథాంశంగా తయారవుతున్న ఈ సినిమాలో కథానాయకులుగా జగదీష్, సూర్య, కథానాయకిగా మౌనిక, ప్రతి నాయకుడి పాత్రలో హరీష్ నటిస్తున్నారు. అలాగే పీలేరు కు చెందిన 'ఆల్ ది బెస్ట్' ఖాదర్, తరిగొండ రాధాకృష్ణ, విజయ్‌కుమార్, బాబ్జాన్, తదితరులు కూడా నటిస్తున్నారు. "ఎంత చిత్రం కథ" సినిమాకు కెమెరామెన్‌గా సంజయ్ జూమ్ ఇన్ నాని, స్టంట్ మాస్టర్లుగా తుఫాన్, సురేష్, సుహేల్ వ్యవహరిస్తున్నారు. నగేష్ సంగీతం సమకూరుస్తున్నారు.



ఎంత చిత్రం కథ చిత్ర నిర్మాణంలోని ఓ సన్నివేశంలో కళాకారులు

వైసిపివి అసత్య ఆరోపణలు

ప్రజాశక్తి-రాయచోటి

మండల పరిధిలోని శిబ్యాల గ్రామానికి చెందిన కొంతమంది వైసిపి నాయకులు పనిగట్టుకొని నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కొత్తపేటలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎటువంటి అన్యాయం చేయదన్నారు. శిబ్యాల గ్రామానికి సంబంధంలేని సంబేపల్లి మండలంలోని రైతులకు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విషయంలో తనపై కొందరు వైసిపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు ఎటువంటి అన్యాయం చేయదని, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రైతులకు న్యాయం చేసే నాయకుడన్నారు. అధికారులకు వైసిపి నాయకులు తప్పుడు డాక్యుమెంట్స్ సృష్టించి, వంక పోరంబోగు స్థలంలో ఏర్పాటు చేయడం సరికాదని, విచారించి ఏర్పాటు చేయమని చెప్పడం జరిగిందన్నారు. ఇప్పటికైనా వైసిపి నేతలు తనపై అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు.



జగన్‌మోహన్‌రాజును సన్మానిస్తున్న టిడిపి నేతలు

'చమర్తి'కి సన్మానం

ప్రజాశక్తి-రాజంపేట

స్థానిక సిద్ధవటం మండలానికి చెందిన సింగిల్ విండో నూతన చైర్మన్లు, అనుబంధ కమిటీ సభ్యులు, మండల టిడిపి ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో రాజంపేట టిడిపిఇన్‌చార్జి జగన్మోహన్ రాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిద్ధవటం మండల సింగల్ విండో చైర్మన్ దారపునేని దశరథ రామా నాయుడు, శ్రీ నిత్యపూజస్వామి దేవస్థానం చైర్మన్ జంగిటి రాజేంద్రప్రసాద్ యాదవ్, సుండుపల్లి సింగల్ విండో చైర్మన్ బెల్లాల రమణయ్య వారి బృందం మాట్లాడుతూ తమకు ఈ పదవులు రావడానికి సహకరించిన టిడిపి రాజంపేట ఇన్‌ఛార్జి జగన్మోహన్ రాజుకు, టిడిపి అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి లో కష్టపడ్డ నాయకులను గుర్తించి పదవులు అందించడం చాలా ఆనందంగా ఉందని, నిజాయితీగా పని చేసి పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొస్తామని, పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటూ నిరంతరం పార్టీ కోసం పని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మోహన్ రెడ్డి, సుండుపల్లి టిడిపి మండల అధ్యక్షుడు కల్లే రెడ్డప్ప, రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ నాగూర్ వీరభద్రుడు, రాష్ట్ర బిసి సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి, కాడే శ్రీనివాసులు నాయుడు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జవహర్‌బాష, పెద్దపల్లి గ్రామ సర్పంచ్ ప్రతినిధి కుర్ర ప్రతాప్ నాయుడు, ఉప సర్పంచ్ నాగం నరసింహారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-రామాపురం

ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు తప్పకుండా ఇకెవైసి చేయించుకోవాలని ఉపాధిహామీ ఎపిఒ పెంచలయ్య పేర్కొన్నారు మండలంలోని చిట్లూరు హసనాపురం నీలకంఠరావుపేట గ్రామాలలో శని వారం ఉపాధి కూలీలకు తీస్తున్న ఇకెవైసిని ఆయన పరిశీలించారు ఉపాధిహామీ చట్టంలో కూలీల జాబ్ కార్డులో ఎంతమంది సభ్యులు పేర్లు ఉన్నారో అందరూ ఇకెవైసి చేయించుకోవాలని చెప్పారు. జాబ్ కార్డు లో సభ్యునిగా పేరు ఉండి ఇకెవైసి చేయించుకొని ఎడల ఉపాధి హామీ పనులకు అనర్హులు అవ తారన్నారు. గ్రామంలో జాబ్ కార్డు కలిగి ఉండి మీరు బయట గ్రామంలో గాని పట్టణాల్లో గాని ఎక్కడ ఉన్నా మీ సొంత గ్రామంలో త్వరగా వచ్చి ఇకెవైసి చేయించుకోవాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభు త్వం ఉపాధి కూలీలకు ఇకెవైసి తప్పనిసరి చేసిందన్నారు. జాబ్ కార్డు లోని సభ్యులు తూచా తప్పకుం డా పాటించాలన్నారు. ఎపిఒ వెంట ఆయా గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లు చంద్రశేఖర్, శివానందరెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

150 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం హెచ్ఎంఎం ఉన్నత పాఠశాలలో తిరుపతి అమర హాస్పిటల్, రైల్వే కోడూరు లోని స్మార్ట్ ఫిజియోథెరపీ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సంస్థ చైర్మన్ కీర్తిపాటి ప్రసాద్‌వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వెంకటేష్ గురజాల(ఆర్థోపెడిక్), డాక్టర్ పి.లోకేష్(జనరల్‌ఫిజీషియన్), డాక్టర్ తిరుమలేష్ (ఆర్థోపెడిక్), డాక్టర్ సాంబ శివ (ఫిజియోథెరపి) వైద్యుల బృందం 150 మంది రోగులకు వైద్య పరీక్షలు, ఇసిజి, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు చంద్రమోహన్‌రాజు, చందర్ రెడ్డి, ట్రెజరర్ పొన్నూరు నరసింహులు, వైద్య విభాగం చైర్మన్ కె.బాలకృష్ణరాజు, విద్యా విభాగం చైర్మన్ ఎ.చెంగల్ రాజు, వెంకటరమణయాదవ్ (కో-చైర్మన్), సినాగేంద్ర(కన్వీనర్), డైరెక్టర్లు, పిజెటి వశంకర్ రాజు, ఎన్ మురళీకృష్ణ, శ్రీనివాసులు రాజు, పి.నారాయణ, మండల రామకృష్ణ, కృష్ణ, ఉదయ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై అవగాహన

ప్రజాశక్తి-వీరబల్లి

రైతులకు వ్యవసాయ రంగంపై అవగాహన అవసరమని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, రఘురామయ్య అన్నారు. శనివారం మండలంలోని దత్తత గ్రామమైన పెద్దమడిగపల్లెలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా 50మంది విద్యార్థులు వ్యవసాయ రంగంపై, అవగాహన సుఖీభవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలు ఎలా పండుతున్నాయి. వాటిని రైతులు ఏ విధంగా పండిస్తున్నారు, ఆహారం ఎలా వస్తుంది, అనే దానిపై క్షేత్ర స్థాయిలో రైతులను వివరించినట్లు తెలిపారు. రైతులకు వ్యవసాయానికి సంబంధించిన సమస్యలు పంట దిగుబడి, గిట్టుబాటు ధర, పంట మార్పిడి ద్వారా లాభనష్టాలు గురించి తెలిపారు. సేంద్రియ ఎరువులు వాడకం, వాణిజ్య పంటలను ప్రోత్సహించడం, వంటి అంశాలు తెలియజేశారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

దోబీఘాట్ ఆక్రమణలను అరికట్టాలి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా దోబీఘాట్‌లు ఆక్రమణకు గురికాకుండా చూడాలని రాష్ట్ర రవాణా, క్రీడా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి శనివారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో అన్నమయ్య జిల్లా రజక సంఘం నేతలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు టి. రమేష్ బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో రజక దోభిఘట్లు ఆక్రమణకు గురికాకుండా చర్యలకు ఆదేశించాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులకు తగిన ప్రాధాన్యం కల్పించాలన్నారు. అలాగే ఎస్‌సి జాబితాలో చేర్చాలనే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసేలా కృషి చేయాలని విన్నవించారు. కార్య క్రమంలో ఉపాధ్యక్షులు టి.లక్ష్మీనారాయణ, ప్రధానకార్యదర్శి వి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

నాణ్యమైన సేవలు అందించి వినియోగదారుల మన్ననలను పొందాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మదనపల్లె రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఆంధ్ర స్పైస్ వారి రాయలసీమ రుచుల హోటల్ ప్రారంభానికి శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రుచి, శుభ్రతలు పాటించి వినియోగదారుల మన్ననలను పొందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, వైసిపి మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్‌బాషా, జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, షబ్బీర్, తిరుపాల్ నాయుడు, జబీఉల్లా, బేపారి అసద్ పాల్గొన్నారు.

శంకర్‌యాదవ్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తంబళ్లపల్లి టిడిపి ఇన్‌ఛార్జి బాధ్యతలు మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ అప్పగించి, పార్టీ పూర్వవైభవానికి బాటలు వేయాలని పార్టీ అధిష్టానానికి నియోజకవర్గం తెలుగు తమ్ముళ్లు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ను నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జి గ్రామ కమిటీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 2014 నుండి 2019 వరకు ఎమ్మెల్యేగా శంకర్ యాదవ్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కార్యకర్తలకు, నాయకులకు సహకరించారన్నారు. 2019 నుంచి 2024 వరకు వైసిపి అధి కారంలో ఉన్నప్పుడు వారి అరాచకాలు, దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని, పెద్దిరెడ్డి కుటుంబానికి ఎదురొడ్డి నిలబడి టిడిపి నిలబెట్టి కార్యకర్తలు, నాయకులను కాపాడుకున్నారన్నారు. పార్టీకి ఆయన సేవలను గుర్తిం చి ఇన్‌ఛార్జి బాధ్యతలను అప్పగిస్తే పార్టీకి పూర్వవైభవం సంతరించుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.



పూడిక పనులను పరిశీలిస్తున్న నీటిసంఘం సభ్యులు

అన్నదాతలకు అండగా నీటి సంఘం సభ్యులు

- సొంత నిధులతో కాలువ పూడికతీత పనులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అన్నదాతలకు అండగా నీటి సంఘం సభ్యులు నిలిచారు. నగర పంచాయతీ పరిధిలోని కానుగలకుంట చెరువు వచ్చే సప్లై ఛానెల్ జెర్రిపోతు కాలువలోని పూడిక, ముళ్ల పొదలను జెసిబితో సొంత నిధులతో తొలగింపజేశారు. అధ్యక్షులు ఎ.రామచంద్ర, ఉపాధ్యక్షులు మద్దేపల్లి శంకర, సభ్యులు బి.రమణప్ప, కె.వెంకటరమణ, విజయ్ నాయుడు, చంద్రబాబునాయుడు, తలారి రామకృష్ణ పనుల పర్యవేక్షించారు. కానుగుల కుంట చెరువుకి నీరు పోయేటట్లు చేశారు. బి.కొత్తకోట ప్రజలకు భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని వారు తెలిపారు. చెరువు నిండితే ఆ చెరువు కింద సాగుకు, పాడి రైతులకు ఉప యోగం ఉంటుందని తెలిపారు. చెరువుకు నీరు చేరేందుకు సహకరించిన నీటి సంఘం సభ్యుల కృషిని రైతులు అభినందించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని కోసివారిపల్లి గ్రామం, సికె దయ్యాలవారిపల్లిలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 77 పశువులకు గాలి కుంటు టీకాలు, బుటాక్స్ పిచికారి, 27 పశువులకు గర్భ కోశ వ్యాధులకు చికిత్స, 32 దూడలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు అంబులెన్సు వెటర్నరీ డాక్టర్ ఇందు తెలిపారు. పాడి రైతులకు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కోసువారిపల్లె జెవిఒ శ్రీనాథ్, పశువైద్య సిబ్బంది పూర్ణిమ, జనార్ధన్, శివనాయక్ పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - నందలూరు

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జరుగుతున్న వారోత్సవాలలో శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మానసిక ఆరోగ్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కెరియర్ గైడెన్స్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ పి.నరేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి, భయాందోళన, అసాధారణ ప్రవర్తన, డిప్రెషన్, యాంగ్జైటీ వంటి వివిధ మానసిక రుగ్మతలకు లోను కావద్దని సూచించారు. అనంతరం మానసిక ఆరోగ్య ప్రాధాన్యత గురించి ర్యాలీ నిర్వహించి చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హైమావతి, జిల్లా కెరీర్ గైడెన్స్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ ఆర్ హనీఫా, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :**వెలుగు సంస్థలో దివ్యాంగులు, వృద్ధులు మధ్య వెలుగు ప్రిన్సిపల్ లీనా కుమారి అధ్యక్షతన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రాధిక మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని, మారుతున్న కాలంతో మానసిక రోగులు గణనీయంగా పెరిగిపోతున్నారని, ఒంటరితనం, డిప్రెషన్ బారిన పడి, ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ప్రస్తుతం అన్నిటికి మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. రకరకాల మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ఇంత మంది చిన్నారులను అక్కున చేర్చుకుని వారికి కావాల్సిన మందులను, విద్యను, సేవలను అందజేస్తున్న వెలుగు సంస్థ సేవలు చాలా గొప్పవని కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీనాకుమారి, సోషల్ వర్కర్ గీత, వార్డెన్ స్వీటీ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో పురిటి బిడ్డ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పురిటి బిడ్డ మృతి కలకలం రేపుతోంది. బాధితుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా, పుంగనూరు నియోజకవర్గం, చౌడేపల్లి కుమ్మరవీధికి చెందిన కవిత రెండో సారి గర్భం దాల్చింది. 12 ఏళ్ల తర్వాత రెండవ సారి గర్భం దాల్చిన కవిత కు శుక్రవారం రాత్రి ప్రసవ నొప్పులు రావడంతో, కాన్పుకోసం రాత్రి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. శనివారం ఆమె ఆడ బిడ్డకు జన్మ నిచ్చింది. ఆ బిడ్డ అప్పటికే చనిపోయి ఉండడంతో వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ చనిపోయిందని బంధువులు ఆరోపిస్తూ వైద్య సిబ్బందితో ఘర్షణకు దిగారు. బిడ్డ కడుపు లోనే ఉమ్మనీరు తాగడం వల్ల చనిపోయిందని డాక్టర్లు తెలిపారు. కొంతసేపు జిల్లా ఆసుపత్రి ప్రసూతి విభాగంలో ఉద్రత నెలకొంది. సమాచారం అందుకున్న రెండవ పట్టణ పోలీసులు ఘటన స్థలం వద్దకు చేరుకొని ఇరు గ్రూపులకు సర్ది చెప్పారు. వైద్యుల నిర్లక్ష్యంతో తమ బిడ్డ చనిపోయిందని మృత శిశువు తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారిస్తున్నట్లు రెండో పట్టణ సిఐ రాజారెడ్డి తెలిపారు.

కరాటే పోటీల్లో 'శ్రీజ్ఞానాంబిక' విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-మదనపల్లె

ఎస్‌వి యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్‌కాలేజియేట్ క్రీడల్లో స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ వద్ద గల శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థి జి. మజహర్‌అలీ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించారు. శనివారం స్థానిక కళాశాలలో ప్రిన్సిపాల్ సురభి రమాదేవి మాట్లాడుతూ, కరాటే కుమితే 84 కేజీల విభాగంలో మజహర్ అలీ జిల్లా వ్యాప్తంగా వచ్చిన క్రీడాకారులను అధిగమించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఫస్ట్ బిబిఎ విద్యార్థి సాధించిన ఈ విజయం కళాశాలకి గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీ శరత్ నాయక్, జగదీష్ పాల్గొన్నారు.

పెన్నా జోన్ టీంకు 30 మంది ఎంపిక

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎపి సూపర్ కప్ పెన్నా జోన్ టీమ్ కు 30 మంది ఫుట్ బాల్ క్రీడాకారులు ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటగిరి శ్రీధర్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎపి సూపర్ కప్‌కు మదనపల్లె జిఆర్‌టి హైస్కూల్ ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో నిర్వహించిన పెన్నా జోన్ టీం ఎంపికకు అన్నమయ్య, కడప, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి అత్యున్నత ప్రతిభ కలిగిన 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి మూడు మ్యాచ్లు నిర్వహించి 30 మంది క్రీడాకారులనుప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. ఎన్నికైన క్రీడాకారులకు వారం రోజులు శిక్షణా శిబిరం ఏర్పాటు చేసి, మైలవరంలో నవంబర్ మొదటి వారంలో జరగబోయే ఎపి సూపర్ కప్‌కు జరిగే మొదటి దశ రాష్ట్ర పోటీలలో పాల్గొంటారని పెన్నా జోన్ కో-ఆర్డినేటర్ మురళీధర్ తెలిపారు. కార్యక్రమంలో అన్నమయ్య ఫుట్‌బాల్ జిల్లా ప్రెసిడెంట్ దిలీప్ కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, దేవలచెరువు హెడ్మాస్టర్ రామా, జీఆర్టీ కరస్పాండెంట్ జగన్మోహన్, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ చిన్ని, రవి, సెలక్షన్ కమిటీ జాన్ కమలేష్, సలీం, అబ్దుల్లా, అసోసియేషన్ సభ్యులు ఇర్షాద్, నరేంద్ర, మహేంద్ర, బాలాజీ, విజయ్, రమణ, సీనియర్ క్రీడాకారులు మైకేల్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి బైక్ బోల్తా : ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్/తంబళ్లపల్లి

రోడ్డు ప్రమాదంలో పెద్దేరు ప్రాజెక్టు వైస్ చైర్మన్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. ఘటనపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మందలవారిపల్లి కు చెందిన పెద్దేరు ప్రాజెక్టు టిడిపి వైస్ చైర్మన్ శివయ్య, అదే గ్రామానికి చెందిన దివాకర్ బైకులో సొంత పనిపై తంబళ్లపల్లికి బయలుదేరారు. మార్గమధ్యంలోని బోయ పల్లి వద్ద బైకు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఇద్దరూ తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి వారిని వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం శివయ్య పరిస్థితి విషమింగా ఉండడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. ఘటనపై కేసు దర్యాప్తులో ఉందని తంబళ్లపల్లె ఎస్ఐ ఉమా మహేశ్వర్ రెడ్డి తెలిపారు.